క్లుప్తంగా

సీసీ కెమెరాలు ఏర్పాటు



ఖిల్లాఘనపురం: మండలంలోని రాంరాయనిపల్లి సమీపంలోని బోడగుట్టపై శనివారం ఫారెస్టు అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం గుట్టపైన, పరిసర ప్రాంతాల్లో రెండు చిరుతలు ప్రజలకు కనిపించడంతో వారు ఫారెస్టు అధికారులకు తెలిపారు. ఉదయం నుంచి వారు గుట్ట పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ కనిపించకపోవడంతో చేసేది లేక గుట్టపైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఫారెస్టు అధికారి భాస్కరాచారి తెలిపారు. గుట్ట పరిసర ప్రాంతాల్లోని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ముఖ్యంగా రైతులు రాత్రివేళలో వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



పాన్‌గల్: తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను సందర్శిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్నట్లు ఎఫ్‌ఎల్‌ఎన్ మండల మానిటరింగ్ టీం సభ్యుడు, పాన్‌గల్ జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, శంకర్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని శాగాపూర్, మాధరావుపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించినట్లు వారు పేర్కొన్నారు. మౌలిక భాషా, గణిత సామర్థ్యాల సాధన(ఎఫ్‌ఎల్‌ఎన్)లో ఆయా పాఠశాలలో తరగతుల వారీగా తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల సామర్థ్యాలు, వర్క్ షీట్ల పరిశీలన, చదివించడం, రాయించడం అంశాలను పరిశీలన చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

యువకుడికి తీవ్ర గాయాలు

ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్‌పై నుంచి పడిన ఓ యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అప్పారెడ్డిపల్లికి చెందిన ఏము శేఖర్ ఖిల్లాఘనపురం నుంచి గ్రామానికి వెళ్తున్న సమయంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రమాద వశాత్తు మోటార్‌సైకిల్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి వైద్యులు సిపార్స్ చేశారు.

ప్రేరణ తరగతులు



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్స్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించినట్లు కరస్పాండెంట్ లావణ్య, డైరెక్టర్ రంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆవరణలో ప్రముఖ మోటివేటర్, సైకాలజిస్ట్ హర్షకిరణ్ సారథ్యంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పెద్దలను ఎలా గౌరవించాలి, క్రమశిక్షణ, నమ్మకం ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ఏ విధంగా మెలగాలో వివరించారు.

ప్లాస్టిక్‌ను నివారిద్దాం



కొత్తకోట రూరల్: పర్యావరణాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీఎస్‌ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రాజ్ అన్నారు. పర్యావరణ్ ఎన్‌జీఓ నెట్‌వర్క్, తెలంగాణ సహకారంతో జీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వాడటం వలన కలిగే అనర్థాలు, జరుగబోయే నష్టం, వాతావరణం కలుషితం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సతీష్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు కూరగాయాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేసిన తర్వాత ప్లాస్టిక్ కవర్లను వాడకుండా బట్ట సంచులను మాత్రమే వినియోగించాలన్నారు. ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లు భూమిలో కలవడానికి వందల ఏళ్లు పడుతుందని, వాడిన కవర్లను జంతువులు తినడం ద్వారా వాటికి ప్రాణహాని కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో సంస్థ తరపున విద్యార్థులకు బట్టతో చేసిన బ్యాగ్స్‌ను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నాగమణి, నర్సమ్మ తదితరులు ఉన్నారు.



వేంకటేశ్వరస్వామి మూలవిరాట్



అమరచింతలో..



ఆత్మకూర్‌లో స్వామివారికి ఏర్పాటు చేసిన

భక్తిశ్రద్ధలతో 'ముక్కోటి' పూజలు

ఆత్మకూర్: ముక్కోటి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆత్మకూర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి దాక వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామికి పంచామృతములతో అభిషేకం, వైకుంఠ ద్వారా పూజ, ఉత్తరద్వార ప్రవేశం, గణపతిపూజ, గోపూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, మహాగణపతి, నవగ్రహ, మహాసుదర్శన, పంచ సూక్త హోమాలు, మహాపూర్ణాహుతి, మహామంగళ హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదవితరణ తదితర కార్యక్రమాలు చేశారు. పూజల్లో న్యాయమూర్తి శిరీష, మాజీఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, నిర్వాహకులు కుర్మన్న, శ్రీనివాస్‌రెడ్డి, నీలేష్, సింగం ఉదయ్, భక్తులు పాల్గొన్నారు.

అమరచింత: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించారు.



ఆత్మకూర్‌లో బారులు తీరిన భక్తులు

పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ నిర్వాహకులు స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ప్రత్యేక వసతులను ఏర్పాటు చేశారు. ముక్కోటి ఏకాదశి రోజు వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే పాపాలన్నీ హరించుకుపోతాయన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.

మదనాపురం: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని శనివారం మండలంలో ఆయా గ్రామాల్లో ప్రజలు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మదనాపురం, అజ్జకొల్లు, దంతనూరు, దుప్పల్లి, కొన్నూరు తదితర గ్రామాల్లో మహిళలు ఆలయాల్లో పూజలు చేశారు.



అమరచింతలో..



ఆత్మకూర్‌లో..

క్రిస్మస్ కానుకల పంపిణీ

కొత్తకోట రూరల్: పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రభుత్వం నుంచి వచ్చిన 150 క్రిస్మస్ కానుకలను మండలంలో గల క్రిస్టియన్లకు ఇచ్చేందుకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపీపీ రఘుప్రసాద్ పాస్టర్లకు అందజేశారు. పాస్టర్లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటస్వామి, ఆర్‌ఐ తిరుపతయ్య, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ గ్రామర్ స్కూల్‌లో వేడుకలు

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని బెస్ట్ గ్రామర్ స్కూల్‌లో శనివారం మినీ క్రిస్మస్ వేడుకలను ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బ్రదర్ ఐఎస్ దీన్‌దయాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సంస్కృతి సాంప్రదాయాలను నేర్పించడం అభినందనీయమన్నారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, అన్ని సంప్రదాయాలను గౌరవిస్తూ



పెద్దమందడిలో క్రిస్మస్ కానుకలను అందజేస్తున్న డీటీ తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపీపీ రఘుప్ర

పాఠశాలలో గొప్పగా కార్యక్రమం నిర్వహించడం మంచిదన్నారు. క్రీస్తు పుట్టుక ఆధారంగానే మానవ చరిత్రను క్రీస్తు పూర్వం, క్రీస్తు శకంగా విభజించారని, ఈ కాలం యువతకు యేసు క్రీస్తు నిస్వార్థం, సహనం సందేశాన్ని ఇస్తాయన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మునీరా ఖాతూన్, ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, బ్రదర్ నతానియల్, శ్యాముల్, పీటర్‌పాల్, ఉపాధ్యాయబృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిపై ఫిర్యాదు

ఆత్మకూర్: తమతో చర్చించకుండా గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీటీసీని కాంగ్రెస్ పార్టీలో చేర్పించుకున్న మండల అధ్యక్షుడు పరమేష్‌పై చర్యలు తీసుకోవాలని రేచింతల కాంగ్రెస్ పార్టీ నాయకులు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలకిష్టన్న, హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టాలు, నష్టాలను భరించామని తమ మీద పెత్తనం చెలాయించిన బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారిని తమకు తెలియకుండా ఎలా చేర్చుకుంటారని మండిపడ్డారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరుగకుండా, సొంత నిర్ణయాలు తీసుకుని పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రం, మహేష్, యాదగిరి, తిరుపతయ్య, రాములు, వెంకట్రాంరెడ్డి, నర్సింహ, రాఘవేంద్ర, ఏసు, పెంటన్న తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చెందిన దేశంగా మార్చుదాం

ఆత్మకూర్: పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెడుతుందని, అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి వినయ్‌కుమార్, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ అబ్బాస్ అలీ అన్నారు. శనివారం మండలంలోని జూరాల, గుంటిపల్లి గ్రామాల్లో వికసిత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో జన్‌ధన్, సురక్ష, కిసాన్‌సమ్మాన్‌యోజన, అటల్ పెన్షన్, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాల గురించి ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా అత్యాధునిక వ్యవసాయం గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మహిముద, సుజాత తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రదర్శన, అవి పేదలకు చేరుతున్నాయా అనే విషయాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్పయాత్రను నిర్వహిస్తుందని యాత్ర జాతీయ పరిశీలకులు కుమార సుందరం అన్నారు. శనివారం మండలంలోని కమాలోద్దీన్‌పూర్, అల్లమాయపల్లి



ఖిల్లాఘనపురం మండలంలో సంకల్పయాత్ర అధికారులతో జాతీయ పరిశీలకుడు

గ్రామాల్లో యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, ఆరోగ్య మిత్ర పలువురు అధికారులు, ప్రజలతో మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ కార్డుల కోసం ఎంత మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారని ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి రాంచందర్ రావు, మండల వైద్యులు డాక్టర్ అయేషా, డాక్టర్ రాంచందర్ రెడ్డి, డాక్టర్ సౌజన్య, సర్పంచ్ శేషయ్య, ఉప సర్పంచు పద్మశ్రీ, పంచాయతీ కార్యదర్శి ఓమేశ్వరి, ఆరోగ్యమిత్ర భగవంతు, ఆశాకార్యకర్త చంద్రకళ, సూపర్‌వైజర్లు, ప్రజలు పాల్గొన్నారు.



గుంటిపల్లిలో..

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: మండల కేంద్రానికి చెందిన చాకలి పార్వతమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వనపర్తి నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌కుమార్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు.

అయోధ్య రాముడి అక్షంతలతో ఊరేగింపు

వనపర్తి టౌన్: అయోధ్యలో వచ్చే నెల 22న ప్రారంభమయ్యే రామాలయంలో పూజలు అందుకున్న అక్షంతలతో శనివారం జిల్లా కేంద్రంలోని చింతల హనుమాన్ గుడిలో హోమాలు నిర్వహించి, స్థానిక రామాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహకారి అమరేందర్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు హర్షవర్ధన్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాములు మాట్లాడుతూ.. జనవరి 1వ తేదీ నుంచి ప్రతి గడపకు అక్షింతలు చేరే విధంగా ప్రతి మండల బజరంగ్‌దళ్ అధ్యక్షులకు సూచించామన్నారు. అయోధ్య రామాలయం 22వ తేదీన ప్రారంభించిన రోజు ప్రతి వ్యక్తి పునీతులు కావాలని, కుటుంబం సురక్షితంగా ఉండాలని అక్షింతలను అయోధ్య రామ మందిరం నుంచి పంపారని తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, కుమారస్వామి, దాసరాజు, ప్రవీణ్, రాములు, రాయన్న సాగర్, మహిళా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు కల్పన, సుమిత్రమ్మ, లక్ష్మి, కవిత, నాయకులు ఉన్నారు.

ఆత్మకూర్: అయోధ్యలో నూతన రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా రామమందిర ట్రస్ట్ పంపిన అక్షంతలు శనివారం ఆత్మకూర్‌కు చేరాయి.



వనపర్తిలో అక్షంతలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న సభ్యులు

స్థానిక నేతాజీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అఖండ జ్యోతిని వెలిగించారు. 2024 జనవరి 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగే సందర్భంగా ఇళ్లల్లో పూజలు నిర్వహించేందుకు అక్షింతలను అందజేస్తున్నట్లు వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు మ్యాడం శ్రీను, నర్సింహారెడ్డి తెలిపారు. అక్షింతలను మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో ఇంటింటికీ చేరవేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కురుమూర్తి, బాలకృష్ణ, సుధాకర్, శ్రీను, అనీల్, కరుణాకర్, శ్రీహరి, దివాకర్, బాలు తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: అయోధ్య రామమందిరం ట్రస్టు నుంచి శనివారం ఖిల్లాఘనపురం మండలానికి రాములోరి అక్షంతలు చేరాయి. వనపర్తి జిల్లా కేంద్రం నుంచి తీసుకొచ్చిన అక్షింతలకు మండలానికి చెందిన విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్ తదితర సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అక్షంతలను గ్రామంలో ఊరేగించి బెస్తగేరి ఆంజనేయస్వామి ఆలయంలో ఉంచారు. వాటిని 2024 జనవరి 1వ తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామాలు, తండాలకు పంపిణీ చేస్తామని విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాములుల తెలిపారు. కార్యక్రమంలో బురాన్ శ్రీను, అంజనేయులు, విక్రం, నారాయణ, ఆశన్న, పాలవాది రాజు తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో..



ఆత్మకూర్‌లో..

కళాశాల విద్యార్థులకు రక్త పరీక్షలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వైద్య సిబ్బంది శనివారం రక్త పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ చిరంజీవులు తెలిపారు. విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి వారి బ్లడ్ గ్రూపు, హిమోగ్లోబిన్ వివరాలను తెలియపర్చినట్లు పేర్కొన్నారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న వారికి మందులను అందజేశామన్నారు. దీంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. వైద్యుల సూచనలను తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్



విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రకాశం శెట్టి, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్, ల్యాబ్ సిబ్బంది, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

చిన్నంబావిలో గీతాపారాయణం

చిన్నంబావి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా వద్ద ప్రవీణ్‌కుమార్, మోహన్ ఆధ్వర్యంలో గీతాపారాయణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థినులు వివిధ కళాఖండాలను నాట్య రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కళ్యాణ్‌రావు, చిన్నంబావి సర్పంచ్ రంజిత్‌కుమార్, బీచుపల్లియాదవ్ హాజరయ్యారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ సకల మానవాళికి దిక్సూచి భగవద్గీత అని, ప్రతి ఒక్కరూ భగవద్గీతను పిల్లలకు నేర్పించాలని, గీతోపదేశంపై ప్రతి



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందిస్తున్న నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, మోహన్

ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం వైకుంఠ అన్నదానం చేశారు. అదేవిధంగా గీతాపారయణం చేసిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని మాంటిసోరి ప్లే వే పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేగా ప్రణవ్‌సాయిగౌడ్, కలెక్టర్‌గా చైతన్యలక్ష్మి, డీఈఓగా సంతోష్‌రెడ్డి, ఎంఈఓగా జశ్వంత్, హెచ్‌ఎం బిందుతో పాటు ఉపాధ్యాయులుగా వ్యవహరించారని పాఠశాల హెచ్‌ఎం రాజేందర్‌గౌడ్ తెలిపారు. చక్కటి నైపుణ్యత కల్పించిన వారికి బహుమతులు అందజేశారు.



ఉపాధ్యాయులైన విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి కోరారు. బడిఈడు పిల్లల ఇంటింటి సర్వేలో భాగంగా శనివారం మండలంలోని బహదూర్‌గూడెంలో బడిమానేసి ఇంటి పనులు చేస్తున్న విద్యార్థుల వివరాలను తెలుసుకొని వారి ఇళ్లకు వెళ్లి విద్య యొక్క ప్రాధాన్యత వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, మెరుగైన విద్య అందుతుందని తెలిపారు. బడి ఈడు కలిగిన పిల్లలచే పనులు చేయించడం నేరమని, చదువుకోవడం వారి హక్కు అని చిన్నారులను బడికి పంపించాలన్నారు. విద్యార్థులను పాఠశాలలకు పంపించి ప్రభుత్వ బడుల బలోపేతానికి తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ కేశవులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: బడిలో ఉండాల్సిన పిల్లలను పనిలోకి పంపించడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ద్వారా అవగాహన కల్పిస్తామని ఎంపీడీఓ కతలప్ప, మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం గోపల్‌దిన్నెలో బడిమానేసి గేదెలను కాసేందుకు వెళ్తున్న జ్యోతి, ఎల్లయ్య దంపతుల పిల్లలు చందు, అనూష ను వారు పాఠశాలలో చేర్పించారు. చదువుకోవాల్సిన వయస్సులో పసిపిల్లలను పనిలో ఉంచడం కూడా చట్టరీత్యా నేరమని వారు అన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ చంద్రారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, సర్పంచ్ విజయ్‌కుమార్, రీసోర్స్ పర్సన్ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని,



వీపనగండ్లలో చిన్నారులకు పాఠశాలలో చేర్పిస్తున్న అధికారులు

అందుకు తల్లిదండ్రులు సహకారం అందించాలని సోళీపురం కాంప్లెక్స్ జీహెచ్‌ఎం జయశంకర్ అన్నారు. శనివారం మండలంలోని సోళీపురంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబయటి పిల్లల ఇంటింటి సర్వేను సీఆర్పీలు నిర్వహించారు. గ్రామంలో ఓ డ్రాపౌట్ విద్యార్థిని గుర్తించి పాఠశాలలో చేర్పించారు. ఈ నెల 11 నుంచి చేపట్టిన సర్వేలో మొత్తం 15 మంది పిల్లలను సీఆర్పీలు పాఠశాలల్లో చేర్పించారని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు రాములు, వెంకటేష్, పార్వతమ్మ, ఐఆర్పీలు రజిత, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.